www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 6 మే 2025



20 మంది విఆర్ఎలకు ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి-మదనపల్లె

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె డివిజన్‌కు చెందిన అర్హత కలిగిన 20 మంది గ్రామ రెవెన్యూ సహాయకులకు ఉద్యోగోన్నోతలు లభించాయి. వీరిని ఆఫీస్ సబ్-ఆర్డినేట్లు, వాచ్‌మెన్‌లుగా ఉద్యోగోన్నతలు ఇచ్చినట్లు మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు అర్హత కలిగిన ప్రతి ఉద్యోగికి విధిగా ఉద్యోగోన్నతలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం ఉద్యోగోన్నతి పొందిన అందరూ సబ్ కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.



ఉద్యోగోన్నతులు పొందిన విఆర్ఎలతో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు

- కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆవరణలో తిరుపతి ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో రెండు రోజుల దక్షిణ మండలి వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమీక్షా సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల తలసరి ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు, వారి జీవన ఆర్థిక స్థితిని మెరుగు పరచడం కోసం ప్రతి వ్యవసాయ శాస్త్రవేత్త, అధికారి, రైతు సశ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గత 20 ఏళ్లుగా శాస్త్రీయబద్ధంగా సిద్ధాంత పరంగా సూచించిన సూచనలే రైతులు అనుసరించేవారన్నారు. ప్రస్తుతం రైతులే క్షేత్రస్థాయిలో శాస్తవేత్తలుగా ఎదుగుతున్నారంటే గర్వించదగ్గ విషయమన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలుగా రైతులకు కావాల్సిన నిజమైన శాస్త్రీయ పద్ధతులను అందజేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఎదురయ్యే నిజమైన సమస్యను గుర్తించినపుడే రైతులకు సంపూర్తి స్థాయిలో సహకారం అందించిన వారు అవుతారన్నారు. పరిశోధన ప్రాణాళికలో పారదర్శకత, నిజాయితీ లేకపోతే కొన్ని రకాల సంప్రదాయ, వారసత్వ పంటలుగా పేరొందిన పంట రకాలను మన ప్రాంత రైతులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వాతావరణ మార్పులకు, మన ప్రాంత భూమి స్వరూపానికి అనుగుణంగా పంటల పరిశోధన జరగాలన్నారు.. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్ కల్చర్ వ్యవసాయ రంగాన్నే పూర్తి స్థాయిలో మార్చి వేసిందన్నారు. సాగునీటి వ్యవస్థలో కూడా విస్తృతమైన, ఉపయోగకరమైన, అనుకులపైన పద్ధతులను అనుసరించేలా కొత్త పద్ధతులను వెతకాలన్నారు. పరిశోధన అనేది కేవలం తాత్కాలిక లాభాల కోసం జరగకూడదని సాగుబడికి, దిగిబడికి, మార్కెటింగ్‌కు అనువైన లాభదాయకమైన, మెకనైజేషన్ తోకూడిన నాణ్యమైన పద్ధతులను సూపొందించాలన్నారు. శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలను.. రైతులకు ప్రజలకు సీజన్ల వారీగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శాస్త్రీయ పద్ధతులను ప్రజలకు చేరవేయడంలో అందుబాటులో ఉన్న అన్ని రకాల కమ్యూనికేషన్ సాధనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం గుంటూరు లామ్ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో వ్యవసాయ పంటల సాగు ప్రాణాళికను సమర్ధవంతంగా రూపొందించి.. రైతులకు లాభదాయకమైన పంటలను ఎంపిక చేయాలని శాస్త్రవేత్తలు, రైతు శాస్త్ర వేత్తలను కోరాను. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ మాట్లాడుతూ సాగుకు ఆమోదయోగ్యమైన భూములు దక్షిణ మండల వ్యవసాయ ప్రాంత పరిధిలో 30 శాతం మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఆ శాతాన్ని మూడింతలు పెంపొందించేందుకు రైతులను ప్రోత్సహిస్తూ లాభదాయకమైన పంటల వంగడాలను సాగులోకి తీసుకు వచ్చేనెదుకు వ్యవసాయ అనుబంధ శాఖల శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు కృషి చేయాలన్నారు. రాస్ పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ దక్షిణ మండలం, జిల్లాల విభజన తరువాత తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు మొదలైన ఐదు జిల్లాలుగా ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. దక్షిణ మండలంలో ఖరీఫ్ కాలంలో 3,14,715 హెక్టార్ల సాధారణ విస్తీర్ణంకు గాను 2,28,688 హెక్టార్లలో (73 శాతం) వివిధ వ్యవసాయ పంటలు సాగుబడి చేయగా రబీలో 4,99,984 హెక్టార్లకు గాను 3,82,470 హెక్టార్లలో (76 శాతం) వివిధ పంటలు సాగు చేయడమైనదన్నారు. అనంతరం దక్షిణ మండల వ్యవసాయ పరిశోధనా కేంద్రం పరిధిలో శాస్త్రవేత్తలు ప్రచురించిన పలు రకాల ప్రచురణ పుస్తకాలను కలెక్టర్ సంబంధిత శాస్త్రవేత్తలు, సంచాలకులతో కలిసి ఆవిష్కరించారు.కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ శారదమ్మ, మైనర్ ఇరిగేషన్ అధికారులు, దక్షిణ మండల జిల్లాల వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు లాంటివని రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మండిపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కల్లులా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి నాబార్డ్ కింద రూ.4.16కోట్లు, ఆర్ఐడిఎస్ కింద రూ.2.6కోట్లు మంజూరైనట్లు తెలపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి ఆరు రోడ్ల అభివృద్ధికి టెండర్లు పిలిచినట్లు తెలిపారు. కేవలం సంక్షేమమే కాదు అభివృద్ధి చేసి చూపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు సిఎం చంద్రబాబు ఎస్‌సిజెడ్ ఇస్తామని చెప్పారని, అందుకోసం మండలం సిబ్యాల గ్రామంలో 700 ఎకరాలను కూడా ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాంతం ఇండస్ట్రియల్‌గా అభివృద్ధి చెందినట్లయితే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి సౌలభ్యం లేని ప్రాంతాలలో ఆర్‌డబ్ల్యుఎస్ వారి ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుం టున్నాని తదెలిపారు. గత ఎన్నో ఏళ్లుగా రాయచోటి నియోజకవర్గంలోని 6 మండలాలకు నీటి సమస్య అధికంగా ఉందన్నారు. ఈ సమస్య వచ్చే వేసవి కాలాని కల్లా తీర్చేందుకు సుమారు వెలిగల్లు నుంచి నీటిని అందించే బృహత్తరమైన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ పథకం జల్ జీవన్ మిషన్ కింద టెండర్లు పిలవడం జరిగిందన్నారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ కింద గత ప్రభుత్వంలో ఏవైతే పనులు నిలిచిపోయామో అవన్నీ కూడా పూర్తి చేసేందుకు రూ.320 కోట్ల ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. అది కూడా వచ్చే నెలలో టెండర్లు పిలిచి వచ్చే 8, 9 నెలల్లోనే హంద్రీనీవా హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేస్-2, కింద శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో నియోజకర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో 43 మంది బాధి తులకు రూ.43.72 లక్షలు సిఎం రిలీఫ్ ఫండ్‌ను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అందిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటే ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాత్రమేనన్నారు.



బాధితులకు ఎల్‌ఒసి పత్రాలను అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చిన్నమండెం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు విశేష కృషి చేస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజమైన పేదలను గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. త్వరలో అర్హులకు నూతన పెన్షన్లు, ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రివర్యులు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడం జరిగింది. బాధితులు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బివైఎస్ నాయకులు

బిటి కళాశాలలో ఇంటర్, పీజీ కోర్సులు ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి బిటి కళాశాలలో గతంలో తొలగించిన ఇంటర్మీడియట్, ఎయిడెడ్ పీజీ కోర్సులను తిరిగి ప్రవేశ పెట్టి, బిటి కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించాలని బహుజన యువసేన ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న బిటి (బిసెంట్ థియోసాఫికల్)కాలేజ్‌లో జిల్లాలోనే మొట్ట మొదటిసారిగా ఇంటర్మీడియట్ కోర్సులను, రాయలసీమ పరిధిలో పీజీ కోర్సులను ప్రవేశ పెట్టిన చరిత్ర ఉందన్నారు. అలాంటి కాలేజ్‌లో ఇంటర్మీడియట్, పీజీ ఎయిడెడ్ కోర్సులను తొలగించడం బాధాకరమని అన్నారు. పేద విద్యార్థులు కార్పొరేట్, ప్రయివేట్ కాలేజీల్లో ఫీజులు చెల్లిం చి చదువుకోలేక, చాలా ఇబ్బందులు ఎదొర్కొంటున్నారని అన్నారు. నూతన విద్యా సంవ త్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో టిబి కాలేజీలో కాలేజ్‌లో గతంలో తొలగి ంచిన కోర్సులను తిరిగి ప్రారంభించి, అడ్మిషన్స్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 2022న విడుదల చేసిన జిఒ ప్రకారం బిటి కాలేజీ ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని యూనివర్సిటీగా ప్రకటించాలని కోరారు. వీటితో పాటు కోట్ల రూపాయలతో నిర్మించిన మ్యూజియం భవన సముదాయం ఆసాంఘిక కార్యకలాపాలకు నెల వుకాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే అసంపూర్తిగా ఉన్న మ్యూజియం భవనం పనులను పూర్తి చేసి ఉపయోగపడేలాగా చర్యలు తీసుకోవాలని కో రారు. కార్యక్రమంలో బహుజన యువజన నాయకులు జిలానిబాషా, హరికృష్ణ, శశి కుమార్,వినయ్, బ్రహ్మ, గౌతమ్, బాలకృష్ణ, సతీష్, శశి కుమార్, దినేష్, రాజేష్ పాల్గొన్నారు.

తెలుగు భాషా సదస్సుకు 'గంగనపల్లి'కి ఆహ్వానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



తెలుగుభాషకు పట్టాభిషేకం అనే పేరుతో ఈనెల 8న హైదరాబాదులోని త్యాగరాయ గానసభ సమావేశ మందిరంలో జరిగే భాషా సదస్సుకు రాజంపేటకు చెందిన తెలుగు అధ్యాపకులు, కవి పండితులు గంగనపల్లి వెంకటరమణ ఆహ్వానం అందు కున్నారు. హైదరాబాదుకు చెందిన తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవ వేడు కలలో భాగంగా నిర్వహిస్తున్న ఈ భాష సదస్సులో గంగనపల్లి వెంకటరమణ పాల్గొన నున్నట్లు సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధి-పరిరక్షణ అనే అంశంపై ఉపన్యసించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పి.బడేసాబ్, సమన్వయకర్త డాక్టర్ వి.జయప్రకాశ్ ల నుంచి తనకు ఆహ్వానం అందినట్లు తెలిపారు. గంగనపల్లి వెంకటరమణ భాష సద స్సుకు ఆహ్వానం అందుకోవడం పట్ల తెలుగు భాషా సంరక్షణ సమితి రాజంపేట మండల శాఖ అధ్యక్షులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, ఉపాధ్యక్షులు బి.వి.నారాయణ రాజు లు హర్షం వ్యక్తం చేశారు.

15న జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు సిఇఒ ఓబులమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8న నిర్వహించ తలపెట్టిన సర్వసభ సమావేశం క్యాబినెట్ మీటింగ్ సందర్భంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించాలని పేర్కొన్నారు.

రేపటి వైవీయూ డిగ్రీ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల బిఎ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బిబిఎ, ఒకేషనల్ 2,4,6 సెమిస్టర్ల కు ఈ నెల 7వ తేదీన జరగాల్సిన పరీక్షను వాయిదా వేసి నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృషా?రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ ఐసెట్ పరీక్ష ఉందని తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేం దుకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, యోగివేమన విశ్వవి ద్యాలయం ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. వాయిదా వేసిన పరీక్షలను ఇదే నెల 23వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు.

కార్మిక వర్గ ఆశాజ్యోతి కార్ల్ మార్క్స్



కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రపంచ గమనాన్ని మార్చిన గొప్ప తత్వవేత్త కార్ల్ మార్క్స్ 207వ జయంతిని పురస్కరించుకుని సోమవారం సిఐటియు కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు నాయకులు మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ 1818 మే 5న జర్మనీ లోని ట్రయర్ పట్టణంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారని, మార్క్స్ జర్మన్ శాస్త్రవేత్త, తత్త్వవేత్త, ఆర్థికవేత్త, సామాజికవేత్త, పాత్రికేయుడు, సోషలిస్టు విప్ల వకారుడని గుర్తు చేశారు. యుక్తవయస్సులో మార్క్స్ ఏ దేశపు పౌరసత్వం లేని స్థితిలో లండన్‌లో జీవితం గడిపాడని, లండన్లోనే మరో జర్మన్ ఆలోచనాపరుడైన ఫ్రెడెరిక్ ఏంగె ల్స్‌తో కలిసి తన చింతన అభివృద్ధి చేసుకుంటూ పలు పుస్తకాలు ప్రచురించారని అన్నారు. 1848 నాటి కరపత్రమైన కమ్యూనిస్ట్ మేనిఫెస్టో వాటన్నిటిలోకీ సుప్రసిద్ధ మైనదని అన్నారు. తదుపరి కాలపు మేధో, ఆర్థిక, రాజకీయ చరిత్రను అతని రచన ప్రభావితం చేసిందని ఆ ప్రభావంతోనే కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక పెట్టుబడి గ్రంథాన్ని రచించాడని తెలిపారు. ఆయన ఆశించిన సమ సమాజ స్థాపన కోసం, ప్రజా హక్కుల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలు పునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎవి.రమ ణ, మున్సిపల్ యూని యన్ జిల్లా అధ్యక్షులు బివి.రమణ, పట్టణ అధ్యక్షులు కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబు, శివ పాల్గొన్నారు.

'కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మత ఉగ్రవాదం కంటే కుల ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరమని, కఠిన చర్యలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని పనసమాకులపల్లిలో సోమవారం బాస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ గ్రామస్థులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 సంవత్సరాలు దాటినా, ఇప్పటికీ కుల వివక్ష తొలగిపోలేదని, కుల ఉగ్రవాదాన్ని అంతం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని, కొన్ని చోట్ల పాలకులే కుల ఉగ్రవాదుల్ని తయారు చేస్తున్నారని విమర్శిం చారు. ప్రభుత్వాలు వీలైనంత త్వరగా కుల ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, లేకుంటే దేశంలో కులాల మధ్య యుద్ధం తప్పదన్నారు. దళితుల అభివృద్ధికి రాజ్యాంగం అందు బాటులోకి తెచ్చిన సౌలభ్యాలను, ఆధిపత్య కుల పాలకులు గాలికొదిలేశారని, తత్కార ణంగా కుల వివక్ష, పేదరికం, నిరుద్యోగం దళితుకు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం చేసే ప్రతీ దళిత కుటుంబానికీ భూమి పంచాలని, ప్రభుత్వం రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, బ్యాంకులు అందించే రుణాల్లో 15 శాతం ఎస్‌సిలకు, 7 శాతం ఎస్‌టిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాస్ రాష్ట్ర నాయకులు నీరుగట్టి రమణ, టి.ఎ.పీర్‌బాషా, గిరిబాబు, బాస్ మరియు వీసీకే నాయకులు వై.గంగాధర్, సొన్నికంటి రెడ్డెప్ప రెడ్డిప్రసాద్, జి.వి. రమణ, వై. చిన్నా, సురేష్, రవిశంకర్ లతోపాటు స్థానిక బాస్ ప్రతినిధులు కాంతమ్మ, హరినాథ్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బాస్ నాయకులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

సమాచార హక్కు చట్టం-2005 పై ప్రజలలో అవగాహన పెంచే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు కమిషన్ ఆధ్వర్యంలో మదనపల్లెలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని కమిషనర్ ప్రమీల తెలిపారు.ఈ నెల5 నుంచి 9 వరకు మదనపల్లె పురపాలక సంఘ పరిధిలోని 43 వార్డుల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ చట్టంలోని మౌలికాంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం ఎలా పొందాలో, చట్టం ద్వారా తమ హక్కులు ఎలా వినియోగించుకోవాలో వివరించారు. అవగాహన కార్యక్రమాలు వైఎస్సార్ నగర్, అమ్మచెరువు మిట్ట, శివాజీ నగర్, ఎస్‌బిఐ కాలనీ, రామారావు కాలనీ, గొల్లపల్లి, నిమ్మలపల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లో కొనసాగాయన్నారు. మొదటి రోజునే 200 మందికిపైగా ప్రజలు, సచివాలయ సిబ్బంది, నోడల్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పీలేరు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోరుతూ నాయకులు పీలేరు తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎన్ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం వారు పీలేరు మండల తహశీల్దార్ భీమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. రిజనల్ కార్యదర్శి పిఎస్ఎం రాజు ఆధ్వర్యంలో పీలేరు తహశీల్దార్‌ను కలసి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదించాలని విజ్ఞప్తి చేసుకున్నారు. కార్యక్రమంలో రిజనల్ సహాయ కార్యదర్శి టి.మధుసూదన్, బిఆర్‌బి నాయక్, పీలేరు డిపో అధ్యక్ష, కార్యదర్శులు సివి.రమణ, జి.ఆదినారాయణ, ఉపాధ్యక్షులు పి.మహేశ్వర, సహాయ కార్యదర్శులు ప్రతాప్, శ్రీరాములు, శివశంకర్, నాగరాజ పాల్గొన్నారు.



సిపిఒకు సమ్మె నోటీసును అందిస్తున్న కార్మిక సంఘాలు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి కార్మికులు సోమవారం సిపిఒ సుదర్శన్‌రెడ్డికి ఈనెల 20న కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించి ముందస్తు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ మనదేశంలో స్వాతంత్రం రాక పూర్వమే బ్రిటిష్ కాలం నుంచి ప్రాణ త్యాగాలు చేసి, పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం 192, వర్క్ మెన్ కంపెన్సేషన్ యాక్ట్ 1923 వేతనాల చెల్లింపు చట్టం 1935తో సహా కనీస వేతనాలు చట్టం 1948 బోనస్ గ్రాడ్యుటి పిఎఫ్ ఈఎస్ఐ లాంటి 29 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని అన్నారు. ఈ లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను కాల రాస్తున్నాయని, ప్రమాదకరమైన లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఎపిఎండిసి, అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మిక పోరాట యూనియన్ లేబర్ కోడ్ రద్దుతో పాటు ఎపిఎండిసిలో ఉన్న పెండింగ్ కార్మిక డిమాండ్‌లను ఈ సమ్మెలో చేర్చినట్లు తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో ఒకరోజు సిఐటియు అనుబంధ సంఘం అయిన మా యూనియన్ పాల్గొనాలని తీర్మానించడం జరిగి సమ్మె నోటీసు సిపిఒకి ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-రాయచోటి

ప్రాణాపాయ స్థితిలో వున్న వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని దీప బ్లడ్ బ్యాంక్‌లో రాయచోటికి చెందిన యువత రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తం నిల్వలు తదితర అంశాలపై దీప బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మైనుద్దీన్ మాట్లాడుతూ ఎంతో మందికి సరైన సమయాలలో రక్తం దొరకక అవస్థలు పడుతూ ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉందన్నారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం చాలా హర్షణీయమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. రక్తం దానం చేయడం వల్ల ఇంకా ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎటువంటి అపోహలు పడవద్దని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలను పొందాలని కోరారు. కార్యక్రమంలో షాబుద్దీన్, మహమ్మద్, షైక్ అజ్జాస్,సమీర్, సనాన్, షాహింషా, రక్త నిధి సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో గర్భిణికి రక్తదానం

రాయచోటి టౌన్ : పట్టణంలోని రెడ్డీస్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీవాణి అనే గర్భవతికి ఎ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో బంధువులు సోమవారం శ్రీ దీప బ్లడ్ బ్యాంక్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన బ్లడ్ బ్యాంకు సిబ్బంది సహారా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ ద్వారా రక్తాదానం చేయించారు. ఈ సందర్భంగా అమీర్ అలి మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఎలాంటి ప్రమాదం లేదని ఆరో గ్యం గా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయొచ్చని అన్నారు. కార్యక్రమంలో అమా నాత్ సేవా సొసైటీ అధ్యక్షుడు అతావుల్లా, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడు


ప్రభుత్వ ఆస్పత్రిలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

ప్రభుత్వ ఆసుపత్రిలో ఇష్టానుసారంగా..

ద్విచక్ర వాహనాల పార్కింగ్

- అవస్థలు పడుతున్న రోగుల సహాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పార్కింగ్ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పట్టణానికి సొంత పనుల నిమిత్తం విచ్చేసే ఇక్కడ పార్కింగ్ చేసి వెళ్ళిపోతారు. ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడం వలన రోగులు, రోగుల సహాయకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అక్కడున్న పుస్తకాలు ... నెలకు ఎంతో కొంత ముట్టచెప్పడంతో పార్కింగ్ చేస్తున్నప్పటికీ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు లబ్ధి ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నా పట్టించు కోకపోవడం శోచనీయం. దీనిపై మండల వైద్యాధికారి, ఆస్పత్రిలో వైద్యులు చొరవ చూపాలని లేనిపక్షంలో ప్రభుత్వ ఆసుపత్రి కాస్త పార్కింగ్ స్థలంగా మారి పోతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు చొరవ తీసుకొని అనుమతి లేని వాహనాలను ప్రభుత్వ ఆసుపత్రిలో అనుమ తించ కూడదని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సొంత పనుల నిమిత్తం వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్ కొరకు మున్సిపల్ అధికా రులు స్థలం కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే పట్ట ణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.


తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

దారికి అడ్డంగా కంచె వేశారని ఫిర్యాదు

ప్రజాశక్తి-పీలేరు

ఊరి పిల్లలు, బడికి వెళ్లే దారికి అడ్డంగా కంచె వేసారంటూ నక్కల మాదిగపల్లి గ్రామస్తులు సోమవారం కెవిపల్లె మండల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే కెవి పల్లి మండలం, నూతన కాల్వ పంచాయతీ, నక్కల మాదిగపల్లిలో 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఎన్నో ఏళ్లుగా కాలనీ పిల్లలు బడికి వెళ్లే దారికి, అదే గ్రామానికి చెందిన అగ్రకులస్తులు దారికడ్డంగా కంచె వేశారు. ఆ కాలనీవాసులు మండల దళిత సీనియర్ నాయకులు ముల్లంగి చంద్రయ్య సహకారంతో సోమవారం స్థానిక మండల తహశీల్దార్ నరేంద్రకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహశీల్దార్ ఆ గ్రామాన్ని సందర్శించి దారి సమస్యపై విచారణ జరిపి తనకు నివేదిక అందివ్వాలని ఆర్ఐ రమణను ఆదేశించారు. ఆర్ఐ నూతనకాల్వ గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న నూతనకాలువ గ్రామ సర్పంచ్ వెంకటమ్మ నాగేశ్వర చొరవ చేసుకుని రెండు రోజుల్లో దారికడ్డంగా ఉన్న కంచెను తొలగించి, దారి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మండల దళిత నాయకులు పత్తిపాటి వెంకటేష్, అమృతపురి చంద్రయ్య, శేషాద్రిబాబు, అమృతపురి నాగేశ్వర, మాల ఐక్యవేదిక మండల నాయకులు రమణ, నూతన కాలువ ఎస్‌సి కాలనీవాసులుపాల్గొన్నారు.

నేడు గాలీటమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-గాలివీడు : మండలంలోని పక్కిరారెడ్డిగారిపల్లికి చెందిన గాలీటమ్మకు మంగళవారం సాయంత్రం మూడు గంటల కు వీరబల్లి వాస్తవ్యులు గాలివీటి.విజయభాస్కరరెడ్డి కుటుంబ సభ్యులతో గాలిట మ్మకు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. మంగళవారం సాయంత్రం గేటు నుంచి గాలిటమ్మ గుడి వరకు మేళ తాళాలతో ఊరేగింపుగా వచ్చి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈనెల12, 13 తేదీలలో గాలిట మ్మ జాతర నిర్వహించడానికి ఏర్పాట్లు చేపడుతున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా టైలరింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు

- విచారించిన నగర పంచాయతీ కమిషనర్ పల్లవి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అధికారులకు ఎటువంటి సమాచారం లేకుండా బి.కొత్తకోట టైలరింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. గత 15 రోజులుగా గుట్టుచప్పుడు టైలరింగ్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. బి.కొత్తకోట నగర పంచాయతీకి కూతవేటు దూరంలోని పాత ఎంపిడిఒ కార్యాలయంలో ఓ నాయకుడి సిఫారసుతో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. లబ్ధిదారులకు సమాచారం ఇవ్వకుండా కేవలం కొంతమంది మహిళలతో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటి తెలియాల్సి ఉందన్నారు. శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్టు నగర పంచాయతీ కమిషనర్, ఎంపిడిఒలకు ఎటువంటి సమాచారం లేదని కొందరు సోమవారం వారి దృష్టికి తీసుకెళ్లడంతో వారు అవాక్కయ్యారు. ప్రభుత్వ పథకాలు నాయకులు చెప్పిన వారికి తప్ప,నిజమైన లబ్ధిదారులకు వర్తించడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలపై కూటమి నాయకుల పెత్తనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని నగర పంచాయతీ కమిషనర్ జివి.పల్లవి పరిశీలించారు.


టైలరింగ్ శిక్షణ కేంద్రంలో విచారణ చేస్తున్న కమిషనర్ పల్లవి

ఆక్రమణదారుల ఆగడాలను అరికట్టలేరా?

- పట్టణంలో మళ్లీ తెరపైకి ఆక్రమణలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మురుగు కాలువపై వేస్తున్న బండరేకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఆక్రమణదారుల ఆగడాలను అరికట్టలేరా అని బి.కొత్తకోట నగర పంచాయతీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని హడావిడి చేసిన మునిసిపల్ అధికారులు మళ్లీ పట్టణంలో అక్రమాలు చేస్తున్నా కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు అక్రమాలను తొలగించారని, అక్రమ కట్టడాలని గుర్తించి తొలగించినా వారు మరల యధావిధిగా కాలువలపై అక్రమ ంగా నిర్మాణాలు చేపడుతూ రోడ్డువైపుకు వచ్చేలా రేకులు వేసుకుంటున్న అధికారులు అటువైపు చూడకపోవడం శోచనీయం. ఆక్రమాలు తొలగించే పేరుతో హడావిడి చేశారే తప్ప ఒరిగిందేమీ లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి కాలువలు తొలగించారు కానీ, కాలువలు నిర్మించడం మరిచారని, అందుకు బడ్జెట్ లేదనే కారణాలు చెప్పడం తప్ప, తొలగించిన ఆక్రమణలపై కాలువలు నిర్మించకపోవడంతో దోమల బెడద ఎక్కువై, దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు. గతంలో కలెక్టరుకు ఫిర్యాదు చేసిన రంగసముద్రం రోడ్డులోని అంబటి రాజేష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి మూడు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు మురుగునీటి కాలువలు నిర్మించకపోవడంతో పెద్దపెద్ద ఎలకలు కాలువలో సంచరిస్తూ ఇంటి పునాదులు తొవ్వేస్తున్నాయని, ఇండ్లు కూలి ప్రాణ నష్టం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిం చారు. ఆక్రమణలు తొలగించిన అధికారులు మరల ఆక్రమణలు చోటు చేసుకో కుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇదంతా చూసుంటే ఎవరికి లబ్ధి చేకూర్చడం కోసం ఆక్రమ కట్టడాలు పేరుతో కాలువలు కూల్చి వేయడం, మీటర్లతో సహా తొలగించడమని పలువురు ప్రజలు మండపడుతున్నారు. కాలు వలను దుర్వాసన వచ్చే విధంగా వదిలేయడంతో సొంతంగా మేమే కాలువలు నిర్మిం చకుంటామని, ఖర్చు ఎవరు భరిస్తారని దుకాణ యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆక్ర మణలు పూర్తిస్థాయి తొలగించి దుకాణదారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు సబ్సిడీపై పశుదాణా


పశు దాణాను పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి, కూటమినాయకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో ఎస్‌సి,ఎస్‌టి పశుపోషకులకు సబ్సిడీ పై పశు దాణాను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని పశువైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. సోమవారం స్థానిక పశువైద్య శాలలో కూటమి నాయకులు, టిడిపి మండలాధ్యక్షుడు పుర్రా వెంకటరమణ, సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, రెడ్డెప్పరెడ్డి, రాజన్నలతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో వచ్చే పశుగ్రాసం కొరతను అధిగ మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి పశుపోషకులకు సబ్సిడీపై పశుదాణాను అందిస్తోందని తెలిపారు. మండలానికి మొదటి విడతగా 250 బస్తాలు వచ్చాయన్నారు. మండలంలోని నిమ్మనపల్లి, తవళం, కొండయ్యగారిపల్లె, సామకోటివారిపల్లె పంచాయతీలకు చెందిన పశుపోషకులకు రూ.1110లు విలువగల 50 కిలోల బస్తా 50 శాతం రాయితీపై రూ.555లకు అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఇతర పంచాయతీలకు విడతల వారీగా పశుదాణాను అందించడం జరుగుతుందన్నారు. పాడి పశువులు కలిగిన ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క బస్తా మాత్రమే ఇవ్వడం జరుగు తుందన్నారు. మరింత సమాచారానికి పశు వైద్యశాలలో గాని, రైతు సేవా కేంద్రంలో గాని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో రాజన్న, రెడ్డప్ప రెడ్డి, సుధాకర, లక్ష్మన్న, ఖాసిం ఖాన్, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆటవిడుపు వేసవి శిక్షణ శిబిరాలు


నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వేసవి సెలవులు వచ్చాయంటే తల్లిదండ్రులు పిల్లలు చేసే అల్లరి భరించలేక అమ్మమ్మ, తాతయ్య ఉండే ఊర్లకు పంపుతుంటారు. అక్కడ పిల్లలు అనవసరంగా సమయాన్ని వృధా చేసి ఆటపాటలతో గడిపేస్తుంటారు. ఇలా తిరిగి చూసేసరికి వేసవి సెలవులు అయిపోతుంటాయి. కానీ ఇప్పుడు కాలం మారింది. సమయం వృధా కాకుండా వేసవి సెలవులను కూడా సద్వినియోగం చేసుకునేందుకు వివిధ సాంస్కృతిక, క్రీడా విభాగాలలో శిక్షణనిచ్చేందుకు అనేక అకాడమీలు ముందుకొచ్చాయి. రాజంపేట మండలంలో గత 20 సంవత్సరాలకు పైగా శివ డాన్స్ అకాడమీ ద్వారా సెలవులలో డ్యాన్స్ మాస్టర్ శివ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించి శాస్త్రీయ నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలలో విద్యార్థులకు తర్ఫీదునిచ్చి తీర్చిదిద్దు తున్నారు. ఎఆర్ డ్యాన్స్ అకాడమీ ద్వారా అభిరామ్ ఆధ్వర్యంలోనూ ఈ వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, ఏకలవ్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ బి.సునీల్, టీ.చంద్రశేఖర్, కే.గంగారామ్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించి ఉచితంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ అందిస్తున్నారు. పిల్లల నుంచి మొబైల్ ఫోన్లు దూరం చేసి శారీరక వ్యాయా మాన్ని అందించే విధంగా తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలు చిన్నారులకు ఆటవిడుపు మాత్రమే కాక విజ్ఞాన భాండారాలుగా నిలు స్తున్నాయి. కోచ్ లు కూడా పిల్లల్ని వివిధ క్రీడా రంగాలలో ప్రోత్సహిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 300 మందికి పైగా ఈ వేసవి శిక్షణ శిబిరాలలో వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్నారు.



తేక్వాండో శిక్షణలో చిన్నారులు

వేసవిలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-నందలూరు

వేసవి కాలంలో ప్రబలే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి డిఎంహెచ్ ఒ డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కుందానెల్లూరు గ్రామంలో స్పెషలిస్ట్ వైద్యులచే నిర్వహించబడుతున్న వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఒ పరిశీలించారు. జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి ఆధ్వర్యం లో, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు ప్రబలకుండా, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలతో ఇంటి ఇంటికి తిరిగి లార్వా సర్వే చేసి, మురుగు గుంతల్లో అబేట్ ద్రావణం పిచికారి చేపించారు. ఎపిడి వెంకటేశ్వర్లు పైప్‌లైన్‌లో లీకేజీలు గమనించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు మరమ్మతులను త్వరితగతిన చేస్తామని తెలిపారు. తాగు నీరు నమూనాను పరిశీలనకు పంపినట్లు తెలిపారు. జిల్లా ప్రజా ఆరోగ్య ప్రయోగశాల నుంచి మైక్రోబయాలజిస్ట్ ఉమాపతి ద్వారా రక్త నమూనాలు సేకరించి మలేరియా, టైఫాయిడ్, సిఆర్‌పి, సిబిపి, డెంగీ, ఆర్.ఎ. ఫ్యాక్టర్, చికెన్ గున్యా, మొదలగు పరీక్షలకి నమూనాలు మదనపల్లెకు పంపినట్లు తెలిపారు. అనంతరం ప్రజలకు చేతుల శుభ్రత, వడదెబ్బ, డెంగీ, ఫ్రైడే డ్రై డే పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గిరిధర్, డాక్టర్.శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, సిహెచ్ఒ నారాయణ, సబ్ యూనిట్ అధికారి. ఎస్ఎస్. దాస్, జిల్లా మలేరియా ల్యాబ్ టెక్నీషియన్ శివ, హెల్త్ అసిస్టెంట్స్ మేల్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపిజిబి ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా డి.మహమ్మద్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎపిజిబి ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా తాను ఎంపికైనట్లు డి.మహమ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మియాపూర్ లోని ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కేంద్ర కార్యాలయంలో ఎఐ ఆర్‌ఆర్ బిఇఎ జాతీయ నాయకులు ఏపీటిఆర్‌ఆర్‌బిఇఎ అధ్యక్షులు బి.రవికాంత్, టిజిబిఇయు అధ్యక్షులు పి.వేణురావు, ఎన్‌ఎఫ్‌ఆర్‌ఆర్‌బిఇఎ జాయింట్ సెక్రటరీ పివి రాహుల్ తేజ్ ఆధ్వర్యంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర వికాస్ గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్లతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. తమ నాయకులు, మాతృ సంస్థ ఎఐఆర్‌ఆర్ బిఇఎ సెక్రటరీ జనరల్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి అవిశ్రాంతఅలుపెరుగని పోరాటం ఫలితమే ఈ బ్యాంకుల విలీనం, కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం యాజమాన్యంతో ఎక్కడ రాజీలేని పోరాటం చేస్తామన్నారు. అన్ని గ్రామీణ బ్యాంకులతో మమేకమై కలిసి చేస్తూ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం తమ శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కామ్రేడ్ ఇ.హనుమంతరెడ్డి, సీజిబి, ఎస్జిబి, ఏపీజివిబి బ్యాంకుల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



రైతులు, కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

అమరావతి, పోలవరం అనే విధానంతో రూ.వందల కోట్లు ఖర్చుపెట్టి ఆ ప్రాంత అభివృద్ధికే ఖర్చు చేయకుండా రాయలసీమ జిల్లాలలోని పేద రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ కోరారు. సేవా సమితి మైదుకూరు మండల శాఖ అధ్యక్షులు జివి సత్రం ఎల్లయ్య ఆధ్వర్యంలో కొత్త గంగవరంలో పేద రైతులు, రైతు కూలీలతో కలిసి మాట్లాడుతూ.. ఈనెల 31న కర్నూలు జిల్లా సంగమేశ్వరం వద్ద రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరెడ్డి ఆధ్వర్యంలో జరిగే సిద్ధవరం అలుగు ప్రజా ప్రాజెక్టు తొమ్మిదో వార్షికోత్సవ బహిరంగ సభ జయప్రదం కోసం ప్రచారం నిర్వహించారు. పేద రైతు కూలీలకు న్యాయం చేయాలని అన్నారు. పేద, రైతు కూలీలకు తాము అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కొత్త గంగవరం పేద రైతులు, రైతు కూలీలు గంగారపు ఆనందరావు, బావికాడి శ్రీనివాసులు, మటమ్ రమేష్, రామసుబ్బయ్య, మహిళా రైతులు లక్ష్మీదేవి, రామలక్ష్మమ్మ, సుబ్బమ్మ, శివమ్మ పాల్గొన్నారు.


మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలను సరిచూసకుంటున్న ఎంఇఒ, సిఆర్‌పిలు

పాఠశాలల ప్రారంభం నాటికి..

వంద శాతం పాఠ్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

పాఠశాలలు ప్రారంభం నాటికి సమయానికి 100 శాతం పాఠ్య పుస్తకాలు అందజేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు చక్రధర్ రాజు, నాగ తిరుమలరావు తెలిపారు. ఇప్పటివరకు మండలానికి 70 శాతం పాఠ్య పుస్తకాలు తమ కార్యాలయానికి అందాయని ఎంఇఒ చెప్పారు. మిగిలిన 30 శాతం పాఠ్య పుస్తకాలు కూడా పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా వచ్చేస్తాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని అన్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికి పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. వీటితోపాటు యూనిఫామ్, టై, బెల్టు, బూట్లు కూడా అందించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యా విధానంలో సమూల మార్పులతో ప్రారంభించనున్నట్లు ఎంఇఒ చెప్పారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి పాల్గొన్నారు.

రైతుకు ప్రోత్సాహం.. ఉద్యాన పంటలకు ఊతం

ప్రజాశక్తి - ఖాజీపేట

వ్యవసాయంలో అధిక ఆదాయం పొందాలనే ఉద్దేశంతో రైతులు వాణిజ్య పంటలసాగుపై దృష్టి సారించారు. వాణిజ్య పంటలకు మార్కెట్లో మంచి ధరలు ఉండడంతోపాటు దిగుబడులు బాగా వస్తున్నాయి. దీంతో రైతులు ఎక్కువగా వాణిజ్య పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలో ఎక్కువ మంది రైతులు అరటి, బొప్పాయి, పసుపు, చెరకు, మామిడి తదితర పంటలు సాగవుతుంటాయి. దిగుబడులు ఆశించినంత మేర ఉండడం, గిట్టుబాటు ధరలు ఉండడంతో ఉద్యాన పంటల సాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు. ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను కూడా అమలు చేస్తోంది. రెండున్నర ఎకరా విస్తీర్ణంలో మామిడి, నిమ్మ, జామ తోటలకు నాలుగేళ్లకు రూ.50వేలు మొత్తాన్ని ప్రోత్సహకరంగా రైతులకు అందజేస్తుంది. బొప్పాయి, సపోటా, సీతాఫలం వంటి పంటలకు రూ.30 వేలు, టిష్యూ అరటి సాగుకు రెండున్నర ఎకరాకు రూ.70 వేలు, డ్రాగన్ పంటలకు రూ.లక్ష ప్రకారం ప్రభుత్వం ప్రోత్సాహకరంగా అందిస్తుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రోత్సహకాల గురించి సరైన అవగాహన లేని రైతులు వాటి గురించి తెలియక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తే ఉద్యాన పంటల సాగు మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఉద్యాన శాఖ అధికారులు ప్రోత్సాహకాల గురించి అవగాహన కల్పించకపోవడం వల్ల ఎక్కువమంది రైతులు వాటి సాగుపై పెద్దగా దృష్టి సారించడం లేదని అంటున్నారు. ప్రభుత్వం, ఉద్యానశాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు సకాలంలో ప్రోత్సాహకాలు అందేలా గట్టి చర్యలు చేపడితే రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుంది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం మరింత పెరుగడానికి అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఉద్యాన శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు సూచిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించాలని ఎఒ మ్యాగీ తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సోమవారం ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఎంటి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మ్యాగీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చని సూచించారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు 16 రకాల నవధాన్యాల విత్తనాల కిట్టు రూ.1000 అందిస్తామన్నారు. అనంతరం ఉత్తమ దిగుబడులను సాధించిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం శ్రీధర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్‌ఛార్జి మహేష్, రైతు ఉత్పత్తి సంఘం సిఇఒ స్రవంతి, ఎన్ఎఫ్ మెంటర్ జయన్న, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ప్రజలు ఆయా కేంద్రాల వద్దకు వెళ్లి వెనుదిరిగి వస్తున్నారు. ఆధార్ శిబిరాలు పెట్టి చిన్న పిల్లలకు పేర్లు నమోదు చేసుకునేందుకు, ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరి చేసేందుకు అవకాశం ఉండడంతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. సోమవారం నుంచి విడతల వారీగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఆధార్ కార్డు సమస్యలకు పరిష్కారం చూపుతామని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ కార్డు ప్రత్యేక శిబిరాలను అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కత్తులూరు సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రం కూడా పని చేయలేదు. ప్రజలు పనులు మానుకుని ప్రతి రోజూ కత్తులూరు వెళ్లి వెనుదిరిగి వస్తున్నారు. ఆధార్ ప్రత్యేక శిబిరాల ఏర్పాటు ప్రకటించి అమలు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ సేవలను అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపిడిఒ కుళ్లాయమ్మను వివరణ కోరగా.. వేంపల్లె మండలంలోని ఆయా ప్రాంతాల్లో మూడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

క్రైం కార్నర్

భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-కలకడ

భర్త వేధింపులతో వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లిలో రెడ్డెప్ప అనే వ్యక్తి ఇంటిలో తెలంగాణ ప్రాంతానికి చెందిన శాంతల మనీ, భార్య చిన్నారి(19) అనే భార్య భర్తలు అద్దెకు నివాసముంటున్నారు. వీరిలో చిన్నారి హైదరాబాదు కాగా మనీది మహబూబ్‌నగర్ అని తెలిపారు. చిన్నారి అనాథ కావడంతో మనీ సంవత్సర క్రితం వివాహం చేసుకున్నట్లు తెలిపారు. వివాహమైన అనంతరం వీరు జీవనోపాధి కోసం ఎర్రయ్యగారిపల్లెలో అద్దె ఇంట్లో ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వీరి సంసారం ఒక ఏడాది పాటు సజావుగా జరిగినప్పటికీ చిన్నారి ఆరు నెలల గర్భిణి.మనీ ప్రతిరోజు తాగి ఇంటికి వచ్చి భార్య చిన్నారిని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ భార్యాభర్తలు గొడవపడే వారిని తెలిపారు. ఆదివారం సాయంత్రం చిన్నారి భర్త మనీ తప్ప తాగి ఇంటికి రావడంతో భర్తను మందలించినట్లు పేర్కొన్నారు. యధా ప్రకారంగానే భర్త మనీ రాళ్ల పని చేసే క్రమంలో సోమవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో చిన్నారితో మరోమారు ఘర్షణ పడ్డారని తెలిపారు. ఈ క్రమంలో భర్త మాటలకు విసుకు చెంది, జీవితంపై విరక్తి చెందిన చిన్నారి వారు నివాసమున్న అద్దె ఇంట్లో ఉరేసుకొని మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. వెంటనే స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పూర్వపరాలు పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం చిన్నారి మృతి చెందిన విషయాన్ని హైదరాబాదులో ఉన్న తన అక్క చిట్టికి ఫోన్ ద్వారా విషయం తెలిపినట్లు తెలిపారు. చిన్నారి మృతి పై స్థానిక విఆర్ఒ పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తును సిఐ గురునాథ చేస్తున్నట్లు తెలిపారు.